# కేదారగౌళ

ఉన్నట్లుండి ఈవేళ నాకెందుకో విశ్వపతి గుర్తుకు వచ్చాడు. అతన్ని నేను మరిచి పోయి వుండేవాడినే కాదు. కాని జీవితంలో అనుకోకుండా వచ్చిన అవలయల వల్ల అలాంటివాళ్ళను ఎందరినో మరచి పోవటం జరిగి పోయింది. ఒకప్పుడు, విశ్వపతి కోసం నేను రోడ్లవెంట నడిచేటప్పుడు కూడా వళ్ళంతా కళ్ళు చేసుకునే వాడిని. ఎక్కడో, యే సందులోనో, యే రహదారిలోనో, ఆకస్మాత్తుగా కనిపించి కనులకు పండుగచేస్తాడేమోనన్న ఆశతో అయిదారు సంవత్సరాలు తాపత్రయ పడ్డాను. అట్లాంటిదే మీ జరక్కపోగా, క్రమంగా అతన్ని మరిచి పోయినాను కూడా.

ఇటువంటి సందర్భంలో యీవేళ విశ్వపతి గుర్తుకు వచ్చాడు. ఎందుకలా గుర్తు వచ్చాడో చెప్పలేను గాని, ''నయం----- యిప్పటికయినా ప్రపంచంలో పడ్డాను'' అనుకున్నాను అతన్ని గురించి ఆలోచన మనసులో మెరవగానే.

విశ్వపతి నాకు యేమీ అవడు. ఒట్టి స్నేహితుడు. అదయినా మేమిద్దరం కలిసి ఎన్నడూ చదువుకోలేదు. కనీసం ఒక వూరి వాళ్ళమన్నా కాదు. కాని పరిచయాలనేవి అప్పుడప్పుడు మంచి పరిణామాలను తీసుకు వస్తాయని విశ్వపతి నాకు ఋజువు చేశాడు. ఏమంటే అతను నాకు అనేక ఉపకారాలు చేసాడు. ఆ ఉపకారాలు అతను చేయకపోయినా మరేం ఫర్వాలేనంత తక్కువ పరిచయం మాది! నాకీ ఉపకారం చేసి పెట్టమని నేనెన్నడూ అతన్ని అడగను గూడా లేదు. అతనంతట అతనే నా జీవితంలో కొన్ని సంవత్సరాల కాలం ఆక్రమించుకుని, నాకు మరో ధ్యాస లేకుండా మూగగా వుండేట్లు చేశాడు.

ఉద్యోగ రీత్యా నేను వూరూరు తిరుగుతూ వుండగా ఎక్కడో ఒకచోట విశ్వపతి నాకు తారసపడ్డాడు. ఎవరోయిద్దరికీ పరిచయం అయిన మనిషి అతన్ని నాకు పరిచయం చేశాడు. నమస్కారం చేశాను. ''ఎంతపని, ఎంతపని!'' అన్నాడు.

ఏమిటది? అన్నట్లుగా ఉలిక్కిపడ్డాను.

''నమస్కారాలను అలా వృధా చేయకండి'' అన్నాడు. ఇంకా'' మంత్రంతో చాలు. తంత్రంతోకూడా ఎందుకు? అయినా నాకంటే మీరు చాలా అధికులు!'' అన్నాడు.

అతనికి జవాబు చెప్పడం నాకు అవసరమనిపించింది. ఏమంటే, యేదో పరిచయం అయాడు కదా బాగుండదనే ధోరణిలో నేను నమస్కారం చేశాను. దాని కతనేదో నమస్కారాల మంత్ర తంత్రాలను గురించి నాకు సోదాహరణ ప్రసంగం యివ్వడానికి తయారయితే, ఆభాగవతమంతా చూస్తూ కూర్చోవటానికి నాకేం సమయం మంచినీళ్ళ ప్రాయం కాదు. ఒక్కక్షణం వృధా అయిందంటే ----జీవితంలో అది మళ్ళీ తిరిగిరాదు అనే పద్ధతిలో మనిషిని నేను.

అసలు విశ్వపతి నాకు యెలా పరిచయమయినాడు అనేది కధకానే కాదు. పరిచయం అయిన మీదట అతను చేసే పనులే నాకు ఎంతో ముఖ్యం.

మొదటిసారి పరిచయం అయినాక నెలరోజులకు కాకినాడ నుంచి విశాఖపట్టణం వెడుతూంటే అతను రైల్లో తారస పడ్డాడు. సరే, రైలు స్నేహితులు గురించి చెప్పేదేముంది? కాస్త కాలక్షేపానికి పనికి వస్తాడు, ఫరవాలేదు అని నేనుగూడా సంతోషించిన మాట నిజమే.

''రైలు బండిలో ప్రయాణం చేయడం కంటే హాయిగా నడిచి వెళ్ళడం బెస్టు. పాదయాత్ర చేసిన పుణ్యమన్నా దక్కుతుంది'' అన్నాడు విశ్వపతి. రైళ్ళను గురించి నాకు ఉన్న అభిప్రాయం కూడా అంతమాత్రపుదేగాని, పాదయాత్ర చేసే ఓపిక లేక నేను అతని వ్యాఖ్యను అట్టే ఆనందించలేక పోయినాను.

ప్రసంగ వశంగా అతను ''పూర్వజన్మలో మీరు నాకు తెలుసు'' అన్నాడు.

''ఎలా తెలుసు?'' అన్నాను.

''మనిద్దరం ఒక కుటుంబంలోనే పుట్టాం. కాకపోతే మీరు నాకంటే పై తరంలో వారు, అందుకనే యిప్పటికీ మీరంటే నాకీ గౌరవం'' అన్నాడు. నిజానికి వయసులో అతనే నాకంటే రెండు మూడేళ్ళు పెద్దవాడు. అయినా యిది ఈ జన్మలో విషయం కదా!

''ఈ విషయం యింత రూఢిగా మీరు ఎలా చెప్పగలుగుతున్నారు. మీకేదన్నా మంత్రశక్తి ఉన్నదా?'' అనడిగాను.

"ఉన్నదీ----లేదూ! ఆ విషయం అలా వుంచండి, నేను చెబుతున్న విషయాలు వినండి గాని. అలా ఎందుకు చెబుతున్నానని ప్రశ్నించకండి-----" అన్నాడు

"విని వూరుకోవటానికయినా, మీరు చెబుతున్నది యే మాత్రమో నిజమనే నమ్మకం నాకు వుండాలి కదా!" అన్నాను. "ప్రయత్నిస్తే ఆ నమ్మకం మీరు యేర్పరుచుకోలేరా?" అని ప్రశ్నించాడు.

"నాకూ ప్రయత్నించాలనే వుంది కానీ ఎలా సాధ్యమో అర్థం కావడంలేదు."

"ఒక విషయం చెబుతాను వినండి! ఈ జన్మలో---- మన యిద్దరికీ ఒకళ్ళకొకళ్ళతో పరిచయం లేదు. బంధుత్వంకాదుగదా మిత్రృత్వంఅన్నాలేదు. అలాంటిది ఎప్పుడోఒక్కసారి మిమ్మల్ని రెండు నిమిషాలు చూచేసరికే నాకు మీరంటే ఎంతో అభిమానం, గౌరవం, ఆపేక్ష కలిగాయంటే ----- యింతకంటే యింకేం నిదర్శనం కావాలి?" అన్నాడు. అతనికీ నాకూ మధ్య యిన్ని మానసిక వికారాలు వున్నాయని యిప్పుడిప్పుడే వింటున్నాను. అయినా యింతమాత్రంచేత అతను పూర్వజన్మ వృత్తాంతాలను ఎలా విప్పి చెబుతున్నాడనేది నాకింకా అయోమయంగా వున్నది. ఈ అనుమానాలను అతని ముందు విప్పి చెప్పటం అంత ప్రయోజనకరమని గూడా నేననుకోలేదు. అతను యేమాత్రమో వెర్రివాడో, చాదస్తుడో అయివుండాలని అనుకున్నాను. అయినా, పక్కవాడి అభిప్రాయాలను----అవి నిజంగా మనకు అడ్డం రానంతవరకు------మన్నించడమే మంచి పని గనక ఆ విషయం యింతకంటే పొడిగించడం నాకు కూడా అనవసరమనిపించింది.

"రెండు నెలల్లో నేను కాకినాడకు మకాం మారుస్తున్నాను" అన్నాడు.

"యేం - ఉద్యోగం బదిలీ అవుతుందా?" అన్నాను.

"అయినా కాకపోయినా, నేను కాకినాడకే చేరుకుంటాను. చూస్తూవుండండి" అన్నాడు.

అన్నట్లుగానే అయింది సరిగ్గా రెండు నెలలకి నాకతను ఉత్తరం వ్రాశాడు. ఉద్యోగసంబంధమైన చిక్కులవల్లయిప్పటి వృత్తికి స్వస్తి చెబుతున్నాననీ, కాకినాడలో మోటారు కంపెనీ వాళ్ళు నెలకు మూడువందల జీతం మీద తనను రమ్మన్నారనీ, వారంరోజుల్లో సకుటుంబంగా విచ్చేస్తున్నాననీ వ్రాశాడు. ఇంతమాత్రంతో ఆగితే అతన్ని

గురించి నాకు అంత విచిత్రం అనిపించేది గాదు. ''మీరు వుంటున్న వీధిలోనే మీయింటికి నాలుగిళ్ళు కుడి పక్కన ఫలానా వారి యిల్లు ఖాళీగా వుంటుంది. మీరు వెళ్ళి తాళం వేసుకురండి. మీరు రేపు వుదయమే యీ పని చేయకపోతే మళ్ళీ వాళ్ళకు ఎవరేనా వచ్చి అద్దె ఎక్కువ యిస్తామంటారు'' అని కూడా వ్రాశాడు. అతను కాకినాడకు రాలేదనీ, యీ యింటి విషయాలు మాట్లాడుకు పోలేదనీ, నాకు రూఢిగా తెలుసు. అయితే యేమిటిదంతా! దివ్యదృష్టితో చూచినట్లు అక్షరాలా వ్రాసి పారేస్తున్నాడు! విశ్వపతి యోగ పురుషుడు కాదుగదా----- అని అనుమానించాను. కాని నిజమేమిటి, అబద్ధమేమిటి అని వితర్కించు కోవటానికి నాలో యేం బలం వున్నది కనక!

విశ్వపతి కాకినాడలో మకాం పెట్టనే పెట్టాడు. అప్పటికి ఆ పట్టణంలో నేను రెండేళ్ళుగా వుంటున్నాను. విశ్వపతి వచ్చినరోజు, అతని కుటుంబమంతా మాయింట్లోనే భోజనాలు చేశారు. అంతవరకు నాకు అతని ఇంట్లో వాళ్ళతో పరిచయం లేదు. అతని భార్య-----కామాక్షమ్మ అని పేరు. నన్ను చూచీ చూడడంతోటే కొంచెం సిగ్గుగా తలదించుకుని నమస్కారం చేసి యింట్లోకి వెళ్ళిపోయింది. అతనికి యిద్దరు పిల్లలు. ఇద్దరూ మగవాళ్ళు. పెద్దవాడికి పదేళ్లుంటాయి. రెండోవాడికి నాలుగేళ్ళు.

విశ్వపతి రోజూ ఉదయం మాయింటికి వచ్చేవాడు. రెండు గంటలసేపు యిద్దరం మాటలాడుకునే వాళ్ళం. సాయంత్రం పూట యిద్దరం యేదో పార్కులో కలుసుకుంటూ వుండేవాళ్ళం. రాత్రి భోజనాలయింతరువాత మా డాబామీద మకాం వేసేవాళ్ళం. రాత్రి ఎంతవరకు మాట్లాడుకునే వాళ్ళమో మాకే తెలిసేది కాదు! ఒక్కొక్కసారి పాల మనిషి కేకలకు మేమిద్దరం ఉలిక్కిపడి కిందకు రావడం కద్దు. నెలకి సగం రోజులు దేశాటనంలోనే గడుపుతూ వుండడం వల్ల మిగతా సగం రోజుల్లో మేమిద్దరం ఎన్నో యుగాలుగా కలుసుకోని స్నేహితుల ఆత్రంతో యిలా సంచరిస్తూ వుండేవాళ్ళం.

విశ్వపతి ఎన్నో విషయాలను గురించి చెబుతూ వుండేవాడు. దాదాపు అతను చెబుతూ వుండడం నేను వింటూ వుండడంగా జరిగిపోయేది కాలమంతా. ఎప్పుడన్నా నన్ను అభిప్రాయాలను గురించి అడుగుతూ వుండేవాడు. నేను నాకు తోచిన విధంగా చెబుతూవుండేవాడిని. నేనిలా ఎందుకు చెబుతున్నానో, నాకు యీ విధమైన అభిప్రాయాలు యేర్పడటానికి ఎటువంటి వాతావరణం దోహదం చేసిందో అతను విపులీకరించి చెబుతూ

వుండేవాడు. అతను చెప్పిందంతా సమంజసంగానే అనిపిస్తూ వుండేది. అతను చెప్పిందాంతో యేకీభవించకుండా వుండటానికి నాకేం కారణాలు కనిపించేవి కాదు.

కాకపోతే అతన్ని గురించి నాకు అర్థంకాని విషయాలు మట్టుకు అలాగే వుండిపోతున్నాయి. ఏమంటే అదేమని అడిగే సాహసం నాకులేదు. అయినా యిలా ప్రశ్నలు అడిగితే జవాబు చెప్పనని అతను యేనాడో ఘంటాపథంగా చెప్పేశాడు.

అయితే అతను చెప్పే కొన్ని సంగతులు మటుకు నాకు నమ్మబుద్ధి అయేది కాదు. కాని నమ్మలేక- నమ్మి నేను చేయగలిగిందేముంది?

ఇలా కొన్ని సంవత్సరాలు దొర్లి పోయాయి. విశ్వపతి ప్రపంచంలో జరిగే అనేక పరిణామాలను గురించి తన వ్యాఖ్యానాలు చెబుతూ వుండేవాడు.

ఒకరోజు అతను నా దగ్గర అయిదు రూపాయలు అప్పు పుచ్చుకు వెళ్ళాడు. ఇంతవరకూ నాకూ అతనికీ డబ్బుకు సంబంధించిన లావాదేవీలు యేమీలేవు. చిట్టి పొట్టి అప్పులు చేయడంగాని, యివ్వడంగాని నాకు సుతరామూ యిష్టంలేదు. అయినా యేం చేయను? అడుగుతున్నవాడు విశ్వపతి! నా దగ్గ[illegible]దని అబద్ధం ఆడడం నా చేతకాదు. అయిదు రూపాయలు యిచ్చి పంపించాను. ఈ సంఘటన గడిచిన తరువాత నెలలు గడిచి పోయాయి. దాదాపు ఒక సంవత్సరం గడిచిపోయింది. మళ్ళీ అతను ఆ అయిదు రూపాయలు తిరిగి యిచ్చే ప్రయత్నంయేమీ చేయలేదు. అది తీసుకువెళ్ళిన నాడు తప్ప తరువాత దాన్ని గురించి ఒక్క అక్షరమయినా ప్రస్తావించలేదు. రోజులు మామూలుగానే గడిచి పోతున్నాయి. నాకు ఉత్సాహం మటుకు ఆగడంలేదు. విశ్వపతి నాచేతిలో చిక్కాడనుకున్నాను. ఈ వెర్రి ఆనందం కూడా నాకెందుకు కలిగిందో ఆ పరమాత్మునికే తెలియాలి. విశ్వపతి ఆ అయిదురూపాయల అప్పును మర్చిపోయి వుంటాడని నేను ఊహించలేను. కాకపోతే అతను మరే కారణం వల్లయివ్వడంలేదోగూడా వూహించుకోలేక సతమతమవుతున్నాను. నా డబ్బు యిచ్చి వేయమని అడగడం తేలికే. నాకూ యేవో అవసరాలుమధ్యవస్తూనే వుంటాయి. వాటిని అధిగమించటానికి విశ్వపతి యివ్వాల్సిన అయిదు రూపాయలను వంతెనగా చేసుకుని ముందుకు పోగలను. అయితే యిలా [illegible] బాగుంటుందా అని నాలో నేను వితర్కించుకున్నాను. బాగుందని మాట అక్షరాలా [illegible] అయితే ఈ విషయానికి అంతంటూ దొరికేది యెక్కడ? విశ్వపతి బాకీ తీర్చడం [illegible]

జాప్యం చేస్తున్నాడో తెల్సుకోవడానికైనా యీవిషయం నేనతని దగ్గర ప్రస్తావించి తీరాలే! అంత యీగొడవ నుంచి విడివడేది ఎట్లా?

సరిగ్గా సంవత్సరానికి నేను అనుకున్నంతపనీ చేసేశాను. ఒకనాడు మాటల సందర్భంలో నాకు డబ్బు ఎంతో అవసరంగా వున్నదనీ, నాకు యివ్వాల్సిన అయిదు రూపాయలూ తిరిగి యిచ్చేస్తే సంతోషిస్తాననీ చెప్పాను.

“సంవత్సరం పాటు ఆగినవాళ్ళు బలే తమాషాగా అడుగు తున్నారే, యిప్పుడేగా నేను మీకాడబ్బు తిరిగి యిచ్చేసింది! మీరు అయిదురూపాయల నోటు జేబులో పెట్టుకుని నిండా నిమిషమైనాకాలేదు. అప్పుడే కథ మళ్ళీ మొదలు పెట్టమంటున్నారా” అన్నాడు.

నాకతని ధోరణి అర్థంకాకపోగా వెర్రెత్తినట్లయింది. వెంటనే నాజేబువంక చూచుకున్నాను. ఓ కొత్త అయుదు రాపాయల కాగితం తొంగి చూస్తోంది! నా కళ్ళను నేనే నమ్మలేకపోవడం లాంటిదేదో తటస్థించింది. కాని ఆ అయోమయంనుంచి తొందరగానే విడివడ్డాను. ఆశ్చర్యంగాని, అనుమానంగానీ యేమీలేదు. జేబులోఅయిదురూపాయలనోటు వున్న మాటేమీ అబద్ధంకాదు. అటువంటి నోటు నా జేబులో అంతకుముందు లేదన్నవిషయం కూడా నాకు రూఢిగా తెలుసు. నాకు మరోసాక్ష్యం యేం కావాలి? నాకు దిగ్భ్రమకలిగినంత పనయింది. అరగంటవరకూ యేమీ మాట్లాడలేకపోయాను. విశ్వపతి కూడా యీ విషయం ప్రస్తావించలేదు. చిరునవ్వు చిందిస్తూ నావంక చూస్తూ కూర్చున్నాడు. అంతే. అతని చర్యలకు వ్యాఖ్యానం కూడా సెలవివ్వలేదు. అతను వెళ్ళిపోయిన తర్వాత యీ విషయం నాలో నేను మళ్ళీ తర్కించుకున్నాను. ఎంత ఆలోచించినా యిందులో అర్థం కానిదేమున్నది గనుక! అర్థంకాని విషయం ఎలాగూ ఎప్పటికీ అలాగే వుంటుంది!

విశ్వపతి యిన్నాళ్ళూ ఎందుకు వేదిస్తున్నట్లు? నేనెప్పుడు అడిగినా యిదేవిధమైన జవాబు నాకు ఎదురయి వుండేదా? విశ్వపతి యోగపురుషుడా? యోగాన్ని గురించి తెలిసి వుండడమే గాక, యిలాంటి వింతవింత ప్రయోగాలు గూడా చేయగలవాడా? ఎన్నో ప్రశ్నలు నా మనస్సును వేధించాయి.

మొత్తంమీద యీ విశ్వపతి దారుణమైన మనిషే అయివుంటాడని అనుకున్నాను. అంతకంటే చేసేదేమీ లేదు గనుకయింక ఆవిషయం అంతటితో స్వస్తిచెప్పి ఊరుకున్నాను.

తరువాత కొన్ని నెలలు గడిచి పోయాయి. ఒకరోజు విశ్వపతి ఉత్సాహంగా మాట్లాడుతూ ''జీవితం మరోమలుపు తిరుగుతోంది'' అన్నాడు. వ్యాఖ్యానించమన్నట్టుగా తల–ఆడించాను.

''మీరు యీవూరునుంచి వెళ్ళిపోతారు. మళ్ళీ మనం కలుసుకోవటం పొసగదు'' అన్నాడు. ఈమాటలు తప్పకుండా నిజమే అవుతాయి కనుక నాకు విదారం అనిపించింది.

''అయితే నాకు బదిలీ అవుతుందన్నమాట'' అన్నాను.

''అవడమే కాదు. మీరు మరోమెట్టు ఎక్కబోతున్నారు.''

''ముందుగా చెప్పినందుకు చాలా థాంక్స్. అయినా మనం కలుసుకోవటం పొసగదని ఎందుకంటున్నారు?'' అనడిగాను. ''అంతే నాకు అలా అనిపిస్తోంది-----'' అని ఆ చర్చ అంతటితో ఆపివేశారు.

''జీవితంలో తాపత్రయాలు లేని మనుషులంటే నాకు చాలా యిష్టం. వాళ్ళకు నేను సహాయం చేస్తూ వుంటాను. ఎలా చేస్తానో వాళ్ళకు తెలీదు. అలా అదృశ్యంగా చేస్తూంటాను. ఎందుకంటే యేమీ అడగని వాళ్ళకు యిచ్చేవాడు ఎవడూ వుండడుగదూ, అందుకని!'' అన్నాడాయన.

''అవును. అడగందీ అమ్మయినా పెట్టదని నానుడి కాదూ!'' అన్నాను.

''అది అలా వుంచండి. కాని యిప్పుడు యీదేశంలోమనుషులందరినీ పరిశీలించండి. ఎవరికీ జీవితంలో తృప్తిలేదు. ఉన్నదాంతో హాయిగా కాలక్షేపం చేయడం అనేది ఏనాడో పోయింది. అందరికీ ఆకాశాన్ని మింగేసేంత ఆశ! పైగా తమని ఎవడో పక్కనున్న ప్రతివాడు పైకి రానివ్వకుండా అడ్డంపడుతున్నాడని చెప్పలేనంతకోపం. ప్రతి మనిషినీ చూడండి, ప్రపంచాన్ని మింగేంత క్రోధంగా కనిపిస్తాడు'' అన్నాడు.

''ప్రపంచంలో అలాంటి మార్పు వచ్చింది. అప్పుడు మనిషిగూడా దానికి అనుగుణంగా తన అభిరుచులను దిద్దుకుని ముందుకు పోవడం సహజమేగా'' అన్నాను.

''ఎవడి కృషి వాడుచేసుకోవచ్చును. అది కాదనడము లేదు నేను. కాని యీ కోపం, క్రోధం,ఆవేశం ఎవరిమీద? ఎవరికోసం?అసలు జీవితంలో తనకుక్కావలసిందేదో తెలుసుకోకుండానే యిన్ని తాపత్రయాలు పెంచుకుంటే యింక మనిషన్నవాడు బాగు పడేదేమిటి, బాముకునేదేమిటి?''

''అలాంటి వేదాంత ధోరణి అందరూ అలవరుచుకుంటే యింక యీ ప్రపంచంలో సుఖాలూ భోగాలూ యేమయిపోతాయి?''

''వేదాంతంలో సుఖంలేదా? అందులో వున్న పరమ సుఖం యింకెక్కడ వుంది?''

''మీరూ ఎన్నయినా చెప్పండి. జీవితంలో కాంపిటీషన్ పెరిగి పోయింది. విలువలన్నీ మారి పోయినాయి. అటువంటప్పుడు యిలా జరక్కయేమవుతుంది?'' అన్నాను.

''అదే నేననేది! ఏం చేస్తున్నారో? ఎందుకు చేస్తున్నారో అర్థం చేసుకోకుండా జనం వూరికే రోడ్ల మీద పరుగెత్తుతున్నారు. ఎందుకా పరుగు పందెం? బోల్తా పడి పళ్ళన్నీరాలగొట్టుకోవటానికేనా? అబ్బబ్బ! ఎన్ని తగాదాలు, ఎన్ని హత్యలు, ఎన్ని మారణాలు! యుద్ధాలులేకుండానే జనం చచ్చిపోతున్నారు. మలమలమాడుతూనే జనం బిలబిల పరుగులు తీస్తున్నారు. ఈ పరిణామం యెక్కడికి దారి తీస్తుందా అన్న విషయాన్ని గురించి నేనింకా పరిశీలన చేస్తూనే వున్నాను. ఇంకా మార్గం దొరకలేదు. త్వరలోనే దీని సంగతేమిటో తెలుసుకుంటాను'' అన్నాడు విశ్వపతి!

ఇటువంటిపని నిజంగా విశ్వపతి లాంటివాడు చేయవలసిందే అనుకున్నాను. సృష్టి పరిణామాన్ని గురించి, దానికి అనుకూలంగా జరిగే మానవజాతి దశలను గురించి, నాకు యేమీ తెలీదు. అయితే యీ మార్పులన్నిటినీ సూక్ష్మంగా పరిశీలిస్తూ కొందరు పరమ గురువులు వుంటారని మటుకు ఎక్కడో పుస్తకంలో చదివాను.

విశ్వపతి చెప్పినట్లుగానే నాకు ఒకనెల రోజుల్లోనే స్థాన చలనం కలిగింది. సంతాపంతోనే అతన్ని వదిలి వెళ్లిపోవలసి వచ్చింది.

కొత్త వూరికి వెళ్ళింతరువాత ఒకటి రెండు సంవతరాలు విశ్వపతి ఉత్తరాలు వ్రాస్తూ ఉండేవాడు. మేం ప్రత్యక్షంగా మాట్లాడుకునే దాని కంటే యీ వుత్తరాలు మరింత సుబోధకంగా, సులభంగా వుండేవి నాకు. కాని విచిత్రమైన విషయం యేమిటంటే యీ వుత్తరాలన్నీ నా దగ్గర శాశ్వతంగా వుండకుండా మాయమైపోతూ వుండేవి. ఉత్తరం రాగానే చదువుకుని బల్లమీద పెట్టేవాడిని. నేను వెనక్కు తిరిగి మళ్ళీ చూస్తే కనిపించేది కాదు. ఆ వుత్తరాలను అలా కాకుండా చేయడం ఎంత ప్రయత్నించినా నాకు సాధ్యంకాలేదు. మరి యే అదృశ్యశక్తి వాటిని ఎత్తుకు పోతోందో విశ్వపతికే తెలియాలి.

ఈ విషయాన్ని గురించి అతనికి వ్రాసికూడా ప్రయోజనం లేక పోయింది. అతని చివరి వుత్తరంమటుకు అతి సూక్ష్మంగా సూటిగా వుంది. "కొన్నాళ్ళపాటు యీ ప్రపంచంలో ఎవరికీ కనపడకుండా పోదాం అనుకుంటున్నాను. ఇట్లా అదృశ్యమైపోవడం చాలా అవసరం అనిపిస్తుంది. భార్యాసుతుల విషయంలో తగిన యేర్పాట్లు చేసేశాను. బహుశా మీకు మళ్ళీ ఉత్తరం వ్రాయటానికి చాలాకాలం పదుతుందనుకుంటాను. అప్పటిదాకా సెలవు!" ఇదీ ఉత్తరం!

విశ్వపతి యెక్కడికి వెళ్ళాడో, యెందుకు వెళ్ళాడో ఎవరికీ తెలియదు. నాకు తెలిసినంత కూడా తెలియదు. నాకు తెలుసునని యెవరికీ తెలియదు గూడాను!

అంతే! విశ్వపతిని గురించి అప్పట్లో నేను చాలా ఆలోచించుకునేవాడిని. కొన్నాళ్ళపాటు అతన్ని గురించే ధ్యాసగా మననం చేసుకునేవాడిని. అదృష్టవశాత్తూ ఎక్కడేనా కనిపిస్తాడేమోనని ఆశిస్తూ వుండేవాడిని. కాని యివన్నీ కేవలం వూహలుగానే మిగిలిపోయినాయి.

జీవితంతో పోటీపడి నేనూ ఎన్నో పరుగులు తీశాను. ఎన్నో వేషాలు వేశాను. ఎన్ని దశలో గడిచాయి. విశ్వపతి మట్టుకు మళ్ళీ కనిపించలేదు. అతని ప్రభావం మటుకు నాకు తెలియకుండానే నామీద పని చేస్తూ వుంటుందని భావిస్తున్నాను.

ఇటువంటి పరిస్థితుల్లో విశ్వపతి నాకు మళ్ళీ గుర్తు వచ్చాడు. ఎక్కడున్నాడు విశ్వపతి? ఏం చేస్తున్నాడు? లోక కళ్యాణం కోసం, విశ్వ శ్రేయస్సు కోసం ఏమయినా చేస్తూ వుంటాడు.

మళ్ళీ విశ్వపతి నాకు కనిపిస్తాడా? అతని దగ్గర్నుంచి నాకు ఉత్తరాలు వస్తాయా? అతని దగ్గర్నుంచి కనీసం సందేశాలయినా అందుకుంటానా? ----- ఈ ప్రశ్నలన్నీ ఎవరిని అడుగుతాను. విశ్వపతి కనిపిస్తేనేగా! అంతవరకూ యీ ప్రశ్నలన్నీ మనసులో వేసుకుంటూ వుండవలసిందే!

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 15-2-61)